GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
THE
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 17-11-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

గుంతల రోడ్లపై గమ్యం చేరేదెలా?

గుండాల గుండెకాయ అంటారు..
అభివృద్ధి దగ్గర మాత్రం మొండిచేయి!



- గుంతలమయమైన రోడ్లు..
  ఇరుకైన మార్గాలు.. నిత్యం ప్రమాదాల భయం
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం..
- తక్షణ మరమ్మతులకు డిమాండ్

2

క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:

ఏ ఎమ్మెల్యే వచ్చినా గుండాల మండలం తన గుండెకాయ లాంటిదని గొప్పగా సంబోధిస్తారు. కానీ అభివృద్ధి విషయానికి వచ్చేసరికి మాత్రం ఆ మాటలు హామీలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుండాల మండలాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలుపుతామని చెప్పే ప్రజాప్రతినిధులు కనీసం గ్రామాలను కలిపే రహదారుల దుస్థితిని కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుండెకాయ అంటున్న గుండాలకు అభివృద్ధి విషయంలో మాత్రం మొండిచేయి చూపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

9



వినిపించని ప్రజా "వాణి"..!

పాలకీడు ప్రజావాణి అభాసుపాలు...



- మూడు వారాలుగా ఒక్క అర్జీ రాకపోవడమే దీనికి నిదర్శనం
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపం
- పరిప్యారంలో జాప్యం..!
- అధికారుల సమయపాలనపై విమర్శలు
- ప్రచార లోపంతో గ్రీవెన్స్‌కు ప్రజలు దూరం

పాలకీడు లో బోసపోయిన ప్రజావాణి

క్రైమ్ మిర్రర్, పాలకీడు

తెలంగాణ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం పాలకీడు మండలంలో అధికారుల నిర్లక్ష్యం, గైరోజు (డుమ్మా) కారణంగా అభాసుపాలవుతోంది.

ప్రజల సమస్యను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేండుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం పాలకీడు మండలంలో పూర్తి స్థాయిలో దారి తప్పుతోంది. అర్జీలు సమర్పించిన సమస్యలు పరిష్కారం కామనే నమ్మకం ప్రజల్లో సన్నగిల్లడానికి తాజా ప్రజా ప్రజావాణి సమావేశానికి ఒక్క దరభాస్తు కూడా రాకపోవడమే సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది.

8

జేఎన్‌టీయూ హాస్టల్ భవనంపై నుంచి దూకిబీటెక్ విద్యార్థి ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 16: జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన వివరాల చిరువేరు రాజు విక్రమ్ బాబు (19) జేఎన్‌టీయూలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో గౌతమి హాస్టల్ మొదటి అంతస్తు ఎఫ్ 107 గదిలో ఉంటూ చదువుకుంటున్నాడు. కాగా..ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో రాజు విక్రమ్‌బాబు తన సోదరితో సెల్‌ఫోన్ మాట్లాడి.. మానసిక క్షోభకు గురవుతున్నట్లు తెలిపాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత హాస్టల్ భవనం నాలుగో అంతస్తుకు వెళ్లి.. కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి విద్యార్థులు గమనించి పోలీసులకు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



గుంతల రోడ్డుపై గమ్యం చేరేదెలా?

(మొదటి పేజీ తరువాయి)

మండలంలోని గంగాపురం, వెల్మజాల, మడిపడిగా గ్రామాల ప్రజలకు రహదారి ప్రయాణం నిత్య నరకంగా మారింది. గ్రామాలను మండల కేంద్రంతో అనుసంధానించే రహదారులు గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని, ప్రజల ప్రాథమిక సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.

“గుంతలే దర్శనం.. ప్రయాణమే ప్రాణసంకటం”!

వెల్మజాల నుంచి గుండాల, గుండాల నుంచి గంగాపురం, మడిపడిగా గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితి రోజురోజుకూ దారుణంగా తయారవుతోంది. రోడ్లపై ఏర్పడిన భారీ గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలువురు వాహనాలపై నుంచి కిందపడి గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు.

“ఇరుకు రహదారులు.. ఇరువైపులా చెట్లు.. తప్పని ప్రమాదాలు”!

రోడ్లు ఇప్పటికే ఇరుకుగా ఉండగా, ఇరువైపులా భారీ చెట్లు పెరిగి వాహనాల రాకపోకలకు మరింత ఆటంకంగా మారుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు తప్పుకునేందుకు కూడా సరైన అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డు పక్కకు దిగే పరిస్థితి లేక చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

“మండల కార్యాలయాలకు వెళ్లాలన్నా అవస్థలే”!

గంగాపురం, వెల్మజాల, మడిపడిగా గ్రామాల నుంచి



మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఈ రహదారుల దుస్థితితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థులు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు రహదారుల కారణంగా సమయం వృథా చేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

“ఇప్పటికైనా స్పందించరా.. ప్రజల ప్రాణాలకు విలువ లేదా”?

ప్రజలకు సురక్షిత రవాణా కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉన్నప్పటికీ, రహదారుల దుస్థితిపై ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతలమయమైన రహదారులకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని, రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించి రహదారులను విస్తరించాలని డిమాండ్ చేస్తున్నారు. హామీలు కాదు.. అభివృద్ధి కావాలి! ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సమస్యను పరిష్కరించాలి. గుండాల మండలాన్ని గుండెకాయగా భావిస్తే, ఆ గుండెకాయకు రహదారుల రూపంలో ఉన్న గాయాలను కూడా నయం చేయాలని గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నారు.

చండూరులో అంగరంగ వైభవంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపన

**చండూరు, క్రైమ్ మిర్రర్ఃఃః



ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలు

క్రైమ్ మిర్రర్,మంగపేట: జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో పత్రికా దినోత్సవ వేడుకలను మండల వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు.అనంతరం మండల వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడు కటుకూరి సాంబశివరావు,జనరల్ సెక్రెటరీ ఇప్పలపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని నిజాయితీ, నిష్పక్షపాత ధోరణితో వార్తలను ప్రజలకు అందిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయులు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం గౌరవ సలహాదారులు ధర్మపురి శ్రీనివాస్, పోలసాని శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి ఉగ్గుమల్ల గణేష్, ప్రచార కార్యదర్శి తాళ్లూరి మధుకర్, సభ్యులు ఈసంపల్లి సురేందర్, స్నేహ కుమార్, గడ్డం ప్రశాంత్, అజరుద్దీన్, యాసం హరీష్, కోడెం నరేష్, బోడ ప్రవీణ్, నూతి వెంకటేశ్వర్లు, తులసి పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానం బోర్డు పదవికి ఆమనగల్ రాజు పేరు

తెలంగాణ ఉద్యమ సేవలకు గుర్తింపు కల్పించాలని స్థానికుల విజ్ఞప్తి



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(ఆమనగల్లు): శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యత్వ పదవికి ఆమనగల్‌కు చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆమనగల్ రాజు పేరు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు, విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ, ప్రజా సమస్యలను టీవీ చర్చా వేదికలపై ప్రస్తావిస్తూ ఆయన గుర్తింపు పొందారు. అమరావతి రాజధాని ఉద్యమంలోనూ ఆయన పాత్ర ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం దేవస్థానం బోర్డులో ఆయనకు అవకాశం కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దల దృష్టికి కూడా ఆయన పేరు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. వివాదాలకు దూరంగా ఉంటూ అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోయే నాయకుడిగా గుర్తింపు ఉన్న రాజుకు పదవి దక్కితే ఆమనగల్ ప్రాంతానికి గౌరవం లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

బీసీ భవన నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు



క్రైమ్ మిర్రర్,మంగపేట: బీసీ భవన నిర్మాణం కోసం రూ. కోటి నిధులు మంజూరు కావడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తినేని ఆదినారాయణ ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు నిర్వహించారు.బీసీ భవన నిర్మాణం కోసం రూ. కోటి నిధులు మంజూరు కావడం పట్ల నాయకులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

సీతక్క కృషి అభినందనీయం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క ములుగు జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు.బడుగు, బలహీన వర్గాల సంక్షేమం మరియు అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు.బీసీల ఐక్యత, ఆత్మగౌరవం మరియు సామాజిక అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని మంగపేటలో బీసీ భవనానికి రూ. కోటి నిధులు కేటాయించడం శుభపరిణామమని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ భవనం బీసీ సంఘాల సమావేశాలకు, ఐక్యతకు మరియు సామాజిక చైతన్యానికి వేదికగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.బీసీ సోదరులందరూ కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తమ హక్కుల సాధనతో పాటు సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, మహిళా నాయకురాళ్లు, యూత్ నాయకులు మరియు వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

- ం జర్నలిస్టుల సేవలను గుర్తించి ప్రభుత్వం న్యాయం చేయాలి
- ం హత్నూర తహశీల్దార్‌కు డీజేఎఫ్ మండల కమిటీ వినతి
- ం డీజేఎఫ్ హత్నూర మండల అధ్యక్షుడు మద్దెల పోచయ్య డిమాండ్
- ం పాల్గొన్న మీనంపల్లి కిషన్ రావు, ముక్కగల్ల యాదన్న, వరిగుంతం శంకర్



హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి నవంబర్ 16: అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని దళిత జర్నలిస్టుల ఫోరం (డీజేఎఫ్) హత్నూర మండల అధ్యక్షుడు మద్దెల పోచయ్య డిమాండ్ చేశారు. సోమవారం హత్నూర తహశీల్దార్ పర్వీన్ షేక్‌కు డీజేఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మద్దెల పోచయ్య మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకువస్తూ ప్రజాసేవ చేస్తున్న జర్నలిస్టులకు ఇప్పటివరకు ప్రభుత్వపరంగా తగిన సంక్షేమ ప్రయోజనాలు అందకపోవడం బాధాకరమన్నారు. ఏళ్ల తరబడి జర్నలిస్టులుగా పనిచేస్తున్నప్పటికీ సొంత ఇల్లు, ఇంటి స్థలం లేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నిరుపేదలుగా గుర్తించి, సంక్షేమ పథకాల నిబంధనల ప్రకారం అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ నివాస స్థలాలు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేయాలని మద్దెల పోచయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పరమేషుల కృష్ణ, సంఘం సభ్యులు శ్రీధర్ గల్ల, బేగరి పద్మారావు మరియు పాత్రికేయులు పాతూరి నగేష్, మామిడిపల్లి రమేష్, బాన్సువాడ శ్రీధర్ గౌడ్, తంగడిపల్లి నవీన్ గౌడ్, కోల విష్ణు, ఉప్పరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గూడూరు శ్రీనివాస్ రెడ్డికి సన్మానం

కడ్తాల్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్): ఆమనగల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగిల్ విండో చైర్మన్‌గా నియమితులైన గూడూరు శ్రీనివాస్ రెడ్డిని కడ్తాల్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గూడూరు శ్రీనివాస్ రెడ్డి విద్యార్థి దశ నుంచే ప్రజా జీవితంలో చురుకుగా ఉంటూ వార్డు సభ్యుడిగా, ఉపసర్పంచ్‌గా, ఎంపీటీసీగా వివిధ హోదాల్లో కడ్తాల్ గ్రామ ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై అవగాహన, సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయనకు సింగిల్ విండో చైర్మన్ బాధ్యతలు దక్కడం సంతోషకరమన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ సహకార రంగ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం గూడూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తనను గుర్తించి ఘనంగా సన్మానించిన గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అల్లాజి, ఉపసర్పంచ్ యాదగిరిరెడ్డి, వార్డు సభ్యులు ఎర్రోళ్ల రాఘవేందర్, భాను కిరణ్, మంకీ మహేష్, ముత్తి కృష్ణ, జహంగీర్ బాబా, కర్రోల రమేష్, దుడ్డు నాగరాజు, నాయకులు మలే మల్లేష్ గౌడ్, క్యామ రాజేష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, విష్ణు, మహేష్, నరేష్, బాబు, సేవ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

ం పిఎసిఎస్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డి



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు): ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్‌గా నియమితులై బాధ్యతలు చేపట్టిన గూడూరు శ్రీనివాస్ రెడ్డికి సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆమనగల్లు మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, సిబ్బంది ఆయనను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తనకు అప్పగించిన పదవిని బాధ్యతగా భావించి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రైతు సంక్షేమానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సహకారంతో ఆమనగల్లు, కడ్తాల మండలాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శోభారాణి, ఎంపీడీవో జయరాం విజయ్, డీటీ వినోద్ కుమార్, ఏవో శ్రీనివాస్ గౌడ్, డీఈ, ఏడీఈ బాలకృష్ణ, సర్పంచులు శ్రీను నాయక్, యాదయ్య, వెంకటయ్య, శ్రీలత, మౌనిక పాల్గొన్నారు.

సినిమా షూటింగ్ లో నారాయణపురం యువకులు

సమవర్తి సినిమాలో వివిధ పాత్రలలో నటులుగా





క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం: సినీ హీరో సత్యదేవ్,సీనియర్ నటుడు శ్రీకాంత్ నటిస్తున్న సినిమా డైరెక్టర్ అజయ్ నాగ్ దర్శకత్వం వహిస్తున్న సమవర్తిమూవీ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నిర్వహించిన షూటింగ్ లో భాగంగా చిన్నచిన్న పాత్రలను నారాయణపురంలో కలని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చి కళాకారులు ఈ పెద్ద ప్రాజెక్టుకు సంబంధించిన సినిమాలో నటులుగా గంగాపురం సాయి గౌడ్, శికిలమెట్ల ప్రభాకర్, అందే నరేష్, బైకని నరేందర్ యాదవ్, పాలకూర్ల శివ, కొండ అయాన్ గౌడ్ నటించడం జరిగింది..ఈ యొక్క పాత్రలలో అడవులలో వన్యప్రాణులు ఉండడంతో ఆ ప్రాంతమంతా సంచరించే చిత్రాలను ఫారెస్ట్ అధికారులుగా, రైతుల పాత్రలలో వివిధ వేషధారాలు వేయడం జరిగింది..అలాగే అమ్మ,అక్క, తమ్ముడి మధ్య జరిగే చిత్రాలను చిత్రీకరించారు. ఇలాంటి కల నైపుణ్యాన్ని తెరమీదకి మీలాంటి వారు నటీనటులుగా ముందుకు సాగాలని డైరెక్టర్ అజయ్ నాగ్ కొనియాడారు. ఆయన చిత్రంలో నటించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

అర్హులందరికీ చేయూత పింఛన్లు: ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం సోమవారం చిట్యాల వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వికలాంగులు, చేనేత కార్మికులు, వితంతువులు, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు ఈ విడతలో పింఛన్లు నిర్మించాలని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ, వాటిని అధిగమిస్తూ ప్రస్తుత ప్రభుత్వం సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. చిట్యాల మున్సిపాలిటీకి నూతన మున్సిపల్ భవనం మంజూరైందని, త్వరలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌తో పాటు 30 పడకల ఆసుపత్రిని కూడా మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వినోద్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కౌన్సిలర్లు నాగిళ్ల సుధాకర్, గాలి యాదమ్మ లింగయ్య, కోనేటి ఎల్లయ్య, జెర్రిపోతుల సత్యనారాయణ, దేశపాక లత రాజేష్, కుక్కల మోహన్, ఏర్పుల పరమేష్, బొబ్బలి సందీప్ రాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పోకల దేవదాస్, టౌన్ అధ్యక్షుడు ఎద్దులపూరి కృష్ణ, బెల్లి సత్తయ్య, ఎస్కే షహది ఇబ్రహీం, ఇమ్రాన్ ,జయారపు శివ ప్రసాద్, కోసనశీ అశోక్, శ్రీకాంత్ చారి, కళ్లెం నరసింహ, సల్ల రాజు,కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గుజ్జుల మహేష్

తలకొండపల్లి మండల అభివృద్ధి, రాజకీయ అంశాలపై చర్చ



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతి రెడ్డిని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తిరుపతి రెడ్డి స్వగృహానికి వెళ్లిన గుజ్జుల మహేష్ ఆయనను కలిసి ఆత్మీయంగా పలకరించారు. తలకొండపల్లి మండలంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకలాపాలు, స్థానిక ప్రజల సమస్యలు తదితర అంశాలపై చర్చించినట్లు గుజ్జుల మహేష్ తెలిపారు.

అన్నేబోయినపల్లిలో 21 మందికి నూతన పెన్షన్లు మంజూరు



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (మూడుగుల): మాడ్గుల మండల పరిధిలోని అన్నేబోయినపల్లి గ్రామంలో అర్హులైన 21 మందికి నూతన పెన్షన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆమనగంటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు. మంజూరైన పెన్షన్లలో రెండు వికలాంగుల, ఎనిమిది గీత కార్మికుల, 11 వితంతు పెన్షన్లు ఉన్నాయి..ఈ సందర్భంగా సర్పంచ్ ఆమనగంటి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వారికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొప్పుల శ్రీశైలం, వార్డు సభ్యులు పులికంటి కృష్ణయ్య, ధార శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి శంకర్, గ్రామ పెద్దలు జి. రామ్ రెడ్డి, ఎ. పర్వత్ రెడ్డి, ఎ. చంద్ర రెడ్డి, కె. చెన్నయ్య, వి. యాదయ్య, డి. అంజయ్య, జి. ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా మల్లేష్ యాదవ్ నియామకం



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) : జిహెచ్ఎంసి బడంగ్పేట్ సర్కిల్ 57వ డివిజన్ అల్మాస్ గూడ గ్రామానికి చెందిన కన్నెమోని మల్లేష్ యాదవ్ ని సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యునిగా నియామకం చేయడం జరిగింది. ఈ నియామక పత్రాన్ని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ నియామకానికి సహకరించిన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డికి, అలాగే బీజేపీ రాష్ట్ర నాయకులు రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డికి కన్నెమోని మల్లేష్ యాదవ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.



పట్టువస్త్రాలంకరణ వేడుకలో చిన్నారులను ఆశీర్వదించిన నేతి విద్యాసాగర్, దైద రవీందర్

చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రాజేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ఎడ్ల శ్రీశైలం యాదవ్ -- మంజుల దంపతుల కుమార్తెలు, కుమారుడి పట్టువస్త్రాలంకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర మాజీ శాసనమండలి ఛైర్మన్ నేతి విద్యాసాగర్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ హాజరై చిన్నారులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్న తుమ్మలగూడెం సర్పంచ్ మహేష్ యాదవ్, చిట్యాల కాంగ్రెస్ నాయకులు జగిని భిక్షం రెడ్డి, పావురాల మత్స్యగిరి యాదవ్, సోమనబోయిన శ్రీశైలం యాదవ్, ఎడ్ల మహాలింగం యాదవ్, పాలకుల పరమేశ్ యాదవ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ అందజేత

చిట్యాల క్రైమ్ మిర్రర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి దాస్ సేవా సమితి ప్రతి సంవత్సరం తన వంతు సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగా సమన్వయకర్త, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నూరు నర్సింగరావు చొరవతో ఈ విద్యా సంవత్సరంలో 30 పాఠశాలలకు పబ్లిక్ అడ్రస్ వ్యవస్థలను అందించాలని సమితిని కోరారు. ఈ క్రమంలో చిట్యాల మండలంలోని బోయగుబ్బ, పిట్టంపల్లి, నేరెడ, చిట్యాల, చిన్నకాపర్తి, గుండ్రాంపల్లి, సుంకెనపల్లి, తాళ్లవెల్లంల, పెరేపల్లి గ్రామాల్లోని మొత్తం తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలకు పబ్లిక్ అడ్రస్ వ్యవస్థలను అందజేశారు. ఈ పరికరాలను నవంబర్ 15న హైదరాబాద్‌లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, సమితి అందించిన పరికరాలను విద్యార్థుల అభివృద్ధికి, బోధనా కార్యక్రమాలకు పూర్తిస్థాయిలో ఉపయోగించుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, విద్యాభివృద్ధికి సహకరిస్తున్న దాస్ సేవా సమితికి, సమన్వయకర్తగా కృషి చేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చెన్నూరు నర్సింగరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



గంజాయి గుడుంబా పై ఎస్సై ఉక్కుపాదం

ం అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

ం ఎస్సై మధుకర్ హెచ్చరిక.

క్రైమ్ మిర్రర్,మంగపేట: మండలంలో గంజాయి,గుడుంబా వ్యాపారాలు,సరఫరా చేసే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బి.మధుకర్ స్పష్టం చేశారు.సోమవారం పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మధుకర్ ను మండల వర్కింగ్ జర్నలిస్టులు(ప్రింట్ మీడియా)కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎస్సై జర్నలిస్ట్ లతో మండలంలోని పలు అసాంఘిక కార్యకలాపాల పై ఉక్కుపాదం మోపానున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాల అక్రమ వ్యాపారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన తేల్చిచెప్పారు.గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలు చేపట్టే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.మండలంలో ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ప్రతి కదలికను గమనిస్తామని తెలిపారు.

యువతకు,తల్లిదండ్రులకు సూచనలు

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వాటి బారినపడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎస్సై మధుకర్ సూచించారు.అదేవిధంగా తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.మండలంలో ఎక్కడైనా గంజాయి,గుడుంబా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు



తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రజలను కోరారు. అక్రమ కార్యకలాపాల నిర్మూలనకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.సమాజంలో మత్తు పదార్థాలు విస్తరించడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తడమే కాకుండా కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని వీటి నిర్మూలనకు పోలీసుల నిఘాతో పాటు స్థానిక ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం ఉందని జర్నలిస్ట్ లు కూడా తెలిసిన సమాచారాన్ని తనకే ఫోన్ లో తెలియజేయవచ్చని తెలిపారు.మండలంలో మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తుందని

డిసెంబర్ 13న సిద్దిపేటలో టిఆర్ఆర్ఎస్ రాష్ట్ర 4వ మహాసభ

ం హాలో రజక..... ఛలో సిద్దిపేట

ం 4వ మహాసభకు భువనగిరి జిల్లా రజక కులస్తులందరు హాజరుకావాలని పిలుపునిచ్చిన రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక

ం ఐక్యతను చాటుదాం.....మన సత్తా చూపుదాం....

క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో: యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా అధ్యక్షులు జూపల్లి నాగేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంబరాజు కుమార్, రాష్ట్ర కన్వీనర్ శాగంటి వెంకటేష్, ఈస్ట్ జోన్ కన్వీనర్ నార్లగిరి కుమారస్వామి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు జూపల్లి నాగేష్ మాట్లాడుతూ.....తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఏర్పడిన నాటి నుంచి ఎన్నో ఉద్యమాలకు నాంది పలికి రజకుల పక్షాన నిలబడి అనేక సమస్యలపైన పోరాటాలు చేసి ఎస్సీ జాబితాలో చేర్చాలనే ఎజెండాతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ, రాష్ట్ర మంత్రులను, ఎంపీ, డిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి వినతులు ఇస్తూ 79 సం.లుగా రజక కులస్తులు నష్టపోయిన తీరును వివరించడం జరిగింది. రాష్ట్ర కన్వీనర్ శాగంటి వెంకటేష్ మాట్లాడుతూ.....తెలంగాణ రాష్ట్రంలో ఎవ్వరూ చేయని విధంగా మహాసభలు ఏర్పాటు చేసి జాతిని జాగృతం చేసి చైతన్యం చేస్తూ హక్కుల దిశగా అడుగులు సాగిస్తున్న తీరును పలు ప్రజాసంఘాల నాయకులు ప్రశంసించారు. రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక మాట్లాడుతూ.....సంఘం ఏర్పడి 9 సం.లు కావస్తున్న సందర్భంగా రాష్ట్ర 4వ మహా సభను సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగింది.కాబట్టి యాదాద్రి భువనగిరి జిల్లా రజక కులస్తులందరు మరియు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా కమిటీ సభ్యులు ప్రతిఒక్కరూ హాజరై సభను విజయవంతం చేసే దానిలో భాగస్వామ్యులు కావాలని యాదాద్రి భువనగిరి జిల్లా రజక కులస్తులను కోరినా రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక.

సర్వసభ్య సమావేశానికి హాజరైన నాయకులు

జిల్లా మహిళా అధ్యక్షురాలు బండిరాల సుశీల,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాండ్ల బాల్ రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల అశోక్ జిల్లా ఉపాధ్యక్షులు మరిపల్లి శ్రీనివాస్,పాండురాజుల ఉప్పలయ్య,జిల్లా యూత్ అధ్యక్షులు గట్టికొప్పుల నవీన్, జిల్లా కార్యదర్శి బొల్లారం జహంగీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గొలనుకొండ పాండు,సిరికొండ ఉపేందర్,నీలం సుదర్శన్, జూపల్లి కృష్ణ,పాండురాజుల నర్సింహా తదితరులు పాల్గొన్నారు



చలిలో నిరాశ్రయులకు అండగా సత్యమేవ జయతే సేవాసమితి

ం యాచకులకు దుప్పట్లు, మంకీ క్యాప్స్, బుట్టలు, భోజనం పంపిణీ

ం సేవా కార్యక్రమాలు అభినందనీయం: సీనియర్ వైద్యులు డాక్టర్ సుబ్బారావు



కోదాడ, నవంబర్ 16 (క్రైమ్ మిర్రర్): సేవా భావమే లక్ష్యంగా సమాజంలోని నిరుపేదలు, అభాగ్యులకు అండగా నిలుస్తూ సత్యమేవ జయతే సేవాసమితి తన దాతృత్వాన్ని చాటుకుంది. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నాదెళ్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలోని దేవాలయాల వద్ద, వివిధ కూడళ్లలో, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న యాచకులకు దుప్పట్లు, మంకీ క్యాప్స్, బుట్టలు, భోజనం పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, సత్యాన్వేషణ మండలి వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్రబాబు హాజరై యాచకులకు స్వయంగా దుప్పట్లు, మంకీ క్యాప్స్, బుట్టలు, భోజనం అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. సత్యమేవ జయతే సేవాసమితిని స్థాపించిన నాదెళ్ల బాలకృష్ణ కోదాడ పరిసర ప్రాంతాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి తన వంతు సహకారం అందిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా చలికాలంలో రాత్రివేళలు బయట ఉంటూ జీవనం సాగించే యాచకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి, వారికి చలి నుంచి ఉపశమనం కలిగించేలా దుప్పట్లు, మంకీ క్యాప్స్ అందించడంతో పాటు ఒకరోజు భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడినవారు, నిరాశ్రయులు, సహాయం అవసరమైన వారిని గుర్తించి వారికి తోడ్పాటు అందించడం గొప్ప మానవతా ధర్మమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా సత్యమేవ జయతే సేవాసమితి ఆధ్వర్యంలో కోదాడ పరిసర ప్రాంతాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కుటుంబాక భాస్కర్, నాదెళ్ల సత్య, అనంతలక్ష్మి, ఆర్. నాగేశ్వరరావు, పుష్యమి, రహీం తదితరులు పాల్గొన్నారు.

కేశవ నగర్ కాలనీలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

ం సొంత నిధులతో ఏర్పాటు చేయించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని కేశవ నగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తన సొంత నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించారు. రాత్రివేళల్లో వెలుతురు లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఆయన ఈ చర్యలు చేపట్టారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ప్రజల నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటుతో రాత్రివేళల్లో రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు మహిళలు, వృద్ధులకు భద్రతాపరంగా ఉపయోగకరంగా ఉంటుందని కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రామకృష్ణ, బీజేవైఎం అధ్యక్షుడు నరేష్ చారి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కాలనీవాసులు మల్లేష్, శ్రీనివాస్, వరప్రసాద్, రాఘవాచారి, కె. రాములు, బి. రాములు, సత్యనారాయణ, విశ్వనాథం, అనంత రాములు, చెన్నయ్య, నరసింహ, బాలు, రామ్మోహన్, లక్ష్మణ్ గౌడ్, ఎన్. శ్రీనివాస్, రాంరెడ్డి శేఖర్, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



వనపర్తి నవంబర్ 16 క్రైమ్ మిర్రర్ : పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఒక వరం లాంటిదని రంగాపురం గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.రామచంద్రారెడ్డి అన్నారు. పేద కుటుంబాలు వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి మంజూరయ్యేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.సోమవారం పెబ్బేరు పట్టణంలోని వల్లపు రెడ్డి అనసూయమ్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన పెన్షన్ల ప్రొసీడింగ్స్, సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్‌తో కలిసి బి. రామచంద్రారెడ్డి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా రంగాపురం గ్రామానికి చెందిన గుర్రం పద్మ భర్త వెంకటయ్యకు రూ.16 వేల చెక్కు, బోయ కవిత భర్త ఎద్దుల ప్రేమ్ కుమార్‌కు రూ.14 వేల చెక్కును పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా సహాయం కోరిన అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దింటి నందీశ్వర్, వార్డు సభ్యులు కటికల ఎల్లస్వామి, మాల సతీష్, దాది రాములు, దేవర్ల అరుణ, బీసుపల్లి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి బాలస్వామి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దారపోగు వెంకటేష్, నాయకులు దాది రాముడు, బెరికి లక్ష్మయ్య, దాది శేఖర్, గడ్డం బీసుపల్లి, గడ్డం శేఖర్, పాలకొండ నరేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



జాతీయ పత్రిక దినోత్సవ సందర్భంగా పత్రిక విలేకరులను సన్మానించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం: యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని ప్రజల పక్షాన పని చేస్తూ నిజాని నీర్భయంగా రాస్తున్న పత్రిక విలేకరులకు జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పత్రిక విలేకరులకు కాంగ్రెస్ పార్టీ మండల ఆధ్యక్షుడు కరంటోత్ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం. ఈ కార్యక్రమానికి విచ్చేసిన విలేకరులకు సత్కరించి పత్రిక దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా మాట్లాడుతూ అనంతరం ప్రజల పక్షాన, ప్రజల కోసం వార్తలను సమస్యలను పత్రికలో ప్రచురిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ముందుకు సాగుతున్న పత్రిక విలేకరులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మందు గుల బాలకృష్ణ కత్తుల లక్ష్మయ్య గుత్త శేఖర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ డైరెక్టర్ మెగావత్ రెడ్డి నాయక్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ బిచ్చ నాయక్ కురుమిద్ద గోపాలు రాచకొండ జంగయ్య వడ్త్యా రాజు తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్ గ్రామంలో 28 మందికి నూతన పెన్షన్ల మంజూరు



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (తలకొండపల్లి): తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ (సంగాయపల్లి) గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన నూతన పెన్షన్ పత్రాలను గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన అర్హులైన 28 మంది మహిళలకు ఆసరా, గీత కార్మిక, ఒంటరి మహిళా పెన్షన్లు మంజూరు కావడంతో గ్రామ కార్యదర్శి రవీందర్‌తో కలిసి పెన్షన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ చెరువు జనరల్ సెక్రటరీ చిలుకం శేఖర్, మాజీ టెంపుల్ చైర్మన్ మొక్తాల రాఘవేందర్ గౌడ్, పెన్షన్ లబ్ధిదారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో దోషికి 20 ఏళ్ల జైలు శిక్ష

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్): ఫోక్సో కేసులో దోషిగా రుజువైన 26 సంవత్సరాల బైగాని సతీష్ కు 20 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ, ఏడు వేల జరినామ విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. 2024లో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదు కాగా దర్యాప్తు చేపట్టిన మీర్పేట్ పోలీసులు. విచారణ అనంతరం కోర్టు న్యాయమూర్తి పద్మావతి నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20ఏళ్ల జైలు శిక్ష, 7వేల జరినామా విధిస్తూ, బాధితురాలికి లక్ష రూపాయల నష్టపోయారని చెల్లించాలని కోర్టు ఆదేశించడం జరిగింది.



ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ పరిమితి పెంచాలి: జంతుక శంకర్

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్): ఇందిరమ్మ ఇళ్ల పథకం మార్గదర్శకాల్లో ఇంటి శ్లాబ్ విస్తీర్ణ పరిమితిని 750 చదరపు అడుగుల నుంచి 950 చదరపు అడుగులకు పెంచాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అండ్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జంతుక శంకర్ కోరారు. సోమవారం ఆమనగల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. జీవో ఎంఎస్ నం.22ను సవరించి ఉమ్మడి కుటుంబాలు, పేద, బలహీన వర్గాల లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా శ్లాబ్ పరిమితిని పెంచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆమనగల్ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు మండల పరిధిలోని అన్ని నీటి శుద్ధి కేంద్రాలను అధికారులు తక్షణమే తనిఖీ చేయాలని జంతుక శంకర్ కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వాటర్ ప్లాంట్ల పరిశుభ్రత, పనితీరు, నీటి నాణ్యత ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని, నిబంధనలు పాటించని కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలకు కల్వకుర్తి విద్యార్థుల ఎంపిక

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి కల్వకుర్తికి చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కల్వకుర్తిలోని శ్రీ లక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలుత తాలూకా స్థాయి, అనంతరం జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ విభాగాల నుంచి ప్రకృతి (శిశుమందిర్), గన్నోజు సాహుతేజ్ (శ్రీ చైతన్య టెక్నో స్కూల్), వేదసాయి (ఎస్‌పీఆర్ పబ్లిక్ స్కూల్), వశీకర్ (శిశుమందిర్) ప్రతిభ కనబరిచి డిసెంబర్ 13న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వి హెచ్ పి సంస్కరణ శిక్షణ విభాగ్ ప్రముఖ్ బొడ్ల మల్లికార్జున్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీశ్వరయ్య, ఆధ్యాత్మిక గురువులు విజయ ప్రతాప్ మహారాజ్, భీమలింగం గౌడ్, విభాగ కార్యదర్శి ఏ. వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు శివయ్య గౌడ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, మహిళా ప్రముఖ్ సుకన్య, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ శివశంకర్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశం

క్రైమ్ మిర్రర్/రంగారెడ్డి ప్రతినిధి: .ఎల్‌నినో ప్రభావంతో రానున్న వేసవిలో జిల్లాలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తాగునీటి సరఫరా, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక శాఖలు, ఉపాధి హామీ పనులపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, నీటి సరఫరాలో అంతరాయాలు ఉన్న గ్రామాలు, ఆవాసాలను గుర్తించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అవసరమైన చోట పాత బోర్లకు మరమ్మతులు చేయడంతో పాటు కొత్త బోర్లు వేయడం, ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పటికీ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్లాన్-ఏ, ప్లాన్-బి, ప్లాన్-సి విధానంలో కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యాత్మక ఆవాసాల వివరాలతో వచ్చే వారం సమీక్షకు హాజరుకావాలని సూచించారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద కూలీలకు గరిష్ఠంగా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. జాబ్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల విభజన తదితర ప్రక్రియలను వేగవంతం చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను



గుర్తించి శనివారం లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రతి గ్రామం, ఆవాస పరిధిలో కనీసం పది మంది రైతులను గుర్తించి పశుగ్రాస సాగుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వాటిని ఎంపీడీఓల ద్వారా పథకంలో అనుసంధానం చేసి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. మంజూరైన గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున మంజూరైన పనులను క్షేత్రస్థాయిలో వెంటనే గ్రౌండింగ్ చేసి, స్థానిక కూలీలకు ఉపాధి కల్పించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ భవనాలు, కాంపౌండ్ వాల్స్ పనులను సమీక్షిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా పనులు ప్రారంభించి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పథకాలు, నిర్మాణాలు, ఇతర సహాయ కార్యక్రమాల అమలులో నిజమైన అవసరం ఉన్న రైతులను గుర్తించి అర్హత ఆధారంగా లబ్ధి చేకూర్చాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ అధికారులు, ఏఈఓలు క్షేత్రస్థాయిలో రైతులతో నేరుగా మాట్లాడి వారి అవసరాలు, ఆసక్తిని గుర్తించాలని, పథకాలపై అవగాహన కల్పించి అర్హులైన రైతులను భాగస్వాములను చేయాలని తెలిపారు.

కార్తీక మాసం తొలి సోమవారం.. శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు

భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్న డాక్టర్ పి. నాగిరెడ్డి దంపతులు, కాలనీ వాసులు

కూకట్ పల్లి, నవంబర్ 16 (క్రైమ్ మిర్రర్) : కూకట్ పల్లి నియోజకవర్గం, మూసా పేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఫతేనగర్ పరిధిలోని శ్రీ హరిహర క్షేత్ర దేవస్థానంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. ఈ పవిత్రమైన రోజును పురస్కరించుకుని దేవస్థానంలోని శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరమశివుని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఈ సందర్భంగా భరత నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి తన సతీమణితో కలిసి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి, భక్తితో పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని కుటుంబ సభ్యులు, కాలనీ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కాలనీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. కార్తీక మాసంలో శివారాధనకు ఎంతో విశిష్టత ఉందని, ముఖ్యంగా సోమవారం రోజున పరమశివునికి అభిషేకాలు, దీపారాధనలు నిర్వహించడం వల్ల ఆధ్యాత్మిక ప్రశాంతత, మానసిక ఆనందం కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో నిర్వహించే



ఇటువంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించ డంతో పాటు, కాలనీ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, భక్తిభావాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు. భక్తుల సందడితో శ్రీ హరిహర క్షేత్ర దేవస్థానం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

వినిపించని ప్రజా"వాణి"..!

మండల, డివిజన్ (ఆర్డీవో) స్థాయిలకు ప్రజావాణి కార్యక్రమాన్ని విస్తరించినప్పటికీ, శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్యలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ ఆశయం ఆవిరైపోతుంది.

పరిష్కారంలో జాప్యం..!

మరోవైపు దరఖాస్తులు సమర్పించి నెలలు గడుస్తున్న ఫైళ్ళలో ఎలాంటి కదలికలు లేకపోవడంపై బాధితులు నుండి ప్రజావాణిపై ఆశ సన్నగిల్లుతోంది. ఒకసారి ఇచ్చిన అర్జీలపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుండటంతో 30 రోజులు గడిచిన తర్వాత తిరిగి వచ్చి మొరపెట్టుకున్నా ఫలితం దక్కడం లేదనీ పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తుంటే మండల అధికారులు మాత్రం దరఖాస్తులను బుట్ట దాఖలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలపై ప్రజలు పదేపదే దరఖాస్తులు ఇస్తున్నా, కింది స్థాయిలో పరిష్కారం ఆలస్యమవుతోందని ఫిర్యాదుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇకనైనా ఉన్నతాధికారుల స్పందించి పెండింగ్లో ఉన్న దరఖాస్తులను గడువులోగా పరిష్కరించి ప్రజావాణి ఆశయాన్ని కాపాడాలని మండల ప్రజలు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

ప్రచార లోపం.. మొక్కుబడిగా నిర్వహణ

ప్రజావాణి కార్యక్రమాలకు స్పందన కరువవడానికి ప్రచార లోపమే కారణమని పలువురు భావిస్తున్నారు.ప్రజావాణి నిర్వహణ వివరాలు ప్రజలకు సమాచారం సకాలంలో అందడం లేదు.గ్రామీణులకు సమాచారం అందని ద్రాక్షగే మిగిలింది. నిరక్షరాస్యులు, స్మార్ట్ఫోన్లు మరియు సోషల్ మీడియాకు దూరంగా ఉండే గ్రామీణ ప్రజలకు ఈ కార్యక్రమం ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందో తెలియడం లేదు.ముందస్తు అవగాహన లేకపోవడం. గ్రామాల్లో దండోరా వేయించడం లేదా పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసులు అంటించడం వంటి సంప్రదాయ ప్రచార పద్ధతులను అధికారులు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి.మండలాల్లో నిర్వహించే గ్రీవెన్స్పై విస్తృత ప్రచారం చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల సమయపాలన లోపం

సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10:00 గంటలకే ప్రారంభం కావాల్సిన ప్రజావాణి అధికారుల ఆలస్యం కారణంగా 11:00 గంటలు దాటిన ప్రారంభం కావట్లేదు. ?మరోవైపు ప్రజావాణి నిర్వహణపై పాలకీడు మండలం లో ఎలాంటి ముందస్తు ప్రచారం కల్పించక పోవడంతో ప్రజలకు సమాచారం లేకుండా పోయింది. ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు రాకపోవడంతో రోజంతా కలిపి ఒక్క దరఖాస్తు కూడా రావడం లేదు. అధికారుల సమయపాలన రాహిత్యం, ప్రజావాణిపై సమాచార లోపం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్దిష్ట సమయానికి ప్రారంభించేలా, విస్తృత ప్రచారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూడు వారాలుగా ఫిర్యాదులు నిల్...

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటామని చెబుతున్నప్పటికీ, వరుసగా మూడు వారాలుగా ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాకపోవడం చర్చకు దారితీస్తోంది.నిజంగానే సమస్యలు లేకపోవడమే ఇందుకు కారణమా? లేక ప్రజావాణిపై తగిన అవగాహన లేకపోవడమా.., గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై స్పష్టత లేకపోవడం వంటి అంశాలు ప్రభావం చూపుతున్నాయా? అన్నది తెలియాల్సి ఉంది. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా నిలవాలంటే ఫిర్యాదుల స్వీకరణతో పాటు వాటి పరిష్కారంపై కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పాలకవీడు మండలంలో వరుసగా మూడు వారాలుగా ఫిర్యాదులు నమోదు కాకపోవడానికి గల కారణాలను అధికారులు పరిశీలించి, ప్రజల్లో ప్రజావాణిపై నమ్మకం పెంచేలా చర్యలు తీసుకుంటారా అన్నది వేచి చూడాలి.

జేఎన్టీయూలో విద్యార్థుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలి...ప్రిన్సిపాల్‌కు విద్యార్థుల వినతి

కూకట్ పల్లి, నవంబర్ 16 (క్రైమ్ మిర్రర్) : జేఎన్‌టీయూ విద్యార్థి విక్రమ్ మృతి నేపథ్యంలో యూనివర్సిటీలో విద్యార్థుల భద్రత, సంక్షేమం, మానసిక ఆరోగ్యం, విద్యాపరమైన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.వి. నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ రఘురాం కి విద్యార్థుల తరఫున వినతిపత్రం సమర్పించారు.

ఈ అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

1. యూనివర్సిటీ హాస్టళ్లు, అకడమిక్ భవనాల టెర్రస్ ప్రవేశ ద్వారాలకు భద్రతా తాళాలు ఏర్పాటు చేయాలి.
2. హాస్టల్ భవనాల పైభాగంలో ప్రమాద నివారణకు ఆరు అడుగుల ఎత్తులో రక్షణ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.
3. క్యాంపస్‌లో అన్ని కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.
4. ఎస్ కె ఎస్ ఎస్ సెక్యూరిటీ, శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ పనితీరుపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం వహించిన ఏజెన్సీపై తగిన చర్యలు తీసుకోవాలి.
5. జేఎన్‌టీయూ హెల్త్ సెంటర్‌ను 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలి.
6. విద్యార్థులకు అందుబాటులో ఉండేలా అర్హత కలిగిన సైకాలజిస్టులు, మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ సదుపాయం కల్పించాలి.
7. విద్యార్థుల బ్యాక్‌లాగ్స్, పరీక్షల్లో ఫెయిల్యూర్ శాతాలపై సమీక్ష నిర్వహించి, మోటివేషన్ క్లాసులు, ఫ్యాకల్టీ మెంటరింగ్ ఏర్పాటు చేయాలి.



8. మూడు కంటే ఎక్కువ బ్యాక్‌లాగ్స్ ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, తల్లిదండ్రులకు సమాచారం అందించే విధానం రూపొందించాలి.
9. విద్యార్థుల భద్రత, సంక్షేమం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, 24 గంటల ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ అందుబాటులోకి తీసుకురావాలి.
10. 16,17,18 తేదీలో జేఎన్టీయూ లో జరిగే అన్ని పరీక్షలను రద్దు చేయాలని విద్యార్థుల వినతిపై యూనివర్సిటీ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. వినతిపత్రంలో పేర్కొన్న అంశాలపై తగిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల భద్రత మరియు సంక్షేమానికి అవసరమైన చర్యలను అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు, పీహెచ్‌డీ స్కాలర్ చల్లా రామకృష్ణ రెడ్డి, దుర్గ, సన్నీ, విమల్, నవదీప్, సాత్విక్, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.



శివన్న గూడెం ప్రాజెక్టుని తక్షణమే పూర్తి చేయాలి

ం పోస్ట్ కార్డ్ తో ప్రభుత్వానికి ఈఎల్వి భాస్కర్ విజ్ఞప్తిలి

ం రాచకొండ ఎత్తిపోతల పథకానికి లిఫ్ట్ ఇరిగేషన్ తక్షణమే ఏర్పాటు చేయాలి

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం : మునుగోడు నియోజకవర్గం లో శివన్న గూడెం ప్రాజెక్టును పూర్తి చేసి రాచకొండ ఎత్తిపోతల పథకానికి లిఫ్ట్ ఇరిగేషన్ తక్షణమే డీపీఆర్ సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేసి పనులు చేపట్టాలని ఈఎల్వి ఫౌండేషన్ చైర్మన్ ఈఎల్వి భాస్కర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోసోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ ఆయన ..శివన్న గూడెం ప్రాజెక్టును పూర్తి చేసి రాచకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను తక్షణమే మొదలుపెట్టి నారాయణపురం, చౌటుప్పల్,అరుట్ల,మంచాల మునుగోడు,రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని కోరారు.కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డీపీఆర్ పూర్తి చేసి,ఈ ప్రాజెక్టును మంజూరు చేసి పనులను పూర్తి చేయాలని ఆయన ముఖ్యమంత్రి కి 10 లక్షల పోస్ట్ కార్డ్ ద్వారా విన్నవిచ్చుకుం టునామని ఈ ఎల్ వి భాస్కర్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఈఎల్వి ఫౌండేషన్ సభ్యులు బండమీది కిరణ్, వెలిజాల శ్రీను, పట్నం బాలకృష్ణ,గుండ మల్లేష్, సికిలమెట్ల హేమెంధర్, నాతి లక్ష్మణ్, రాసమల్ల ముత్యాలు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర సహిత అన్నపూర్ణేశ్వరి ఆలయ నిర్మాణానికి రావు కార్తీక్ రావు రూ.1,11,111 విరాళం

కూకట్ పల్లి,నవంబర్ 16 (క్రైమ్ మిర్రర్) : కూకట్‌పల్లి వివేకానంద నగర్‌లో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కాశీ విశ్వేశ్వర సహిత అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణం సందర్భంగా కూకట్‌పల్లికి చెందిన రావు కార్తీక్ రావు స్వామి, అరుణ్ గురు స్వామి సమక్షంలో ఆలయ నిర్మాణానికి సహాయార్థం రూ. 1,11,111/- (ఒక లక్ష పదకొండు వేల నూట పదకొండు రూపాయలు) విరాళంగా ఆలయ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కి అందజేశారు. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఆలయాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం ఎంతో అభినందనీయమని, పవిత్రమైన ఈ ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చి ఉదారంగా విరాళం అందించిన రావు కార్తీక్ రావు స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ దైవకార్యంలో భాగస్వాములవుతూ సమాజానికి ఆధ్యాత్మిక సేవ చేయడం గొప్ప విషయమని భక్తులందరి సహకారంతో ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని రాజేశ్వరరావు తెలిపారు.

